# స్వార్థం వీడి సంఘశ్రేయస్సుకు పాటుపడండి

ప్రాచీన ఋషులకు పాఠముల్ నేర్పింప
జాలిన వేదాంత సారమతులు
నిర్జీవ శిలలచే నృత్యమాడించెడి
నేర్పు కల్గిన కళానిపుణమతులు
పరవీరశిరములు బంతులాడించుచు
క్రీడింపగలిగిన వాడిమగలు
సర్వసర్వంసహా చక్రపాలనజేసి
నడిపించగలిగిన నాయకులును
కలరు భారతభువిని పెక్కండ్రు చూడ
ఉండి ఫలమేమి వారిలో ఒక్కరైన
అనుదినంబును వినిపించు ఆర్తరవము
ఆలకింప దలంపరో ఆర్యులార!

***విద్యార్థినీవిద్యార్థులారా!*** విద్య అనగా ఏమిటి? ఎట్టి విద్యను మనం అభ్యసించాలి? విద్య ప్రమాణములు ఏమిటి? మానవాభ్యుదయమునకు మార్గదర్శకమైన విద్య ఏది? ప్రస్తుత విద్యవల్ల మనకు లభించే ఫలితమేమిటి? ఈ పంచతంత్రములయొక్క ప్రభావాన్ని విచారణ చేసి విపులంగా అర్థం చేసుకున్నవాడే నిజమైన విద్యార్థి. విజ్ఞాన, ప్రజ్ఞానములు కేవలం విద్యవలన లభించేవి కావు. విద్యతోపాటు సంస్కారమును అభివృద్ధి పరచుకున్నప్పుడే ఈ పవిత్రమైన శక్తులు మానవునికి చేకూరుతాయి. సంస్కారమనగా ఏమిటి? మానవుడు నిత్య జీవితములో అసత్యమైన, అప్రమాణమైన, అనిత్యమైన మార్గమును విడిచి నిత్యసత్యమైన మార్గములో ప్రవేశించి తన మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చుకోవడానికి ప్రయత్నించడమే సంస్కారము. దివ్యత్వము ఎక్కడున్నది? ప్రతి మానవునియందు సత్య స్వరూపమై తాండవమాడుచున్నది. పుడమిపై గల ప్రతి వ్యక్తికి సత్యమే ప్రత్యక్ష దైవము. మీరు కాపాడవలసింది దేశమును కాదు. సత్యధర్మములను పోషిస్తే అవే దేశాన్ని కాపాడుతాయి. సత్య ధర్మములను కాపాడినప్పుడే ఈ జగత్తంతా సుక్షేమంగా ఉంటుంది. ఈ జగత్తంతయు సత్యధర్మములపైనే ఆధారపడి యున్నది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్వమిదియె చూడరయ్య

మానవుడు సత్యముపైనే ఆధారపడి ఉన్నాడు. సత్యధర్మములే జగత్తును కాపాడుతున్నాయి. కాని, మానవుడు ఈ

సత్యాన్ని గుర్తించుకోలేక అనేక బాధలకు గురి అవుతున్నాడు.

ఇది చేయి, ఇది కాలు, ఇది తల... ఇవన్నీ దేహానికి అంగములు. ఈ దేహము సమాజానికి అంగము. సమాజము మానవత్వానికి అంగము. మానవత్వము ప్రకృతికి అంగము. ప్రకృతి పరమాత్మకు అంగము. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మీకు దివ్యత్వము అర్థమౌతుంది. నిజంగా ఎవరికి వారు అంతర్దృష్టితో విచారణ చేసినప్పుడు దివ్యత్వమే మానవత్వాన్ని నడిపిస్తున్నదనే సత్యము బోధపడుతుంది. దివ్యత్వము లేకుండిన మానవుడు ఒక్క క్షణమైనా జీవించలేడు. కాని, మానవుడు దివ్యత్వము లేకుండా తాను జీవించగలననే అహంకారముచేత కాలము గడుపుతున్నాడు. కాలము గడిపినంతమాత్రాన కర్మ సార్థకము కాదు.

**కర్తవ్యమును నిర్వర్తించినప్పుడే హక్కు ప్రాప్తిస్తుంది**

కర్తవ్యం మొదలా? లేక, హక్కు మొదలా? అనే విషయాన్ని మనం విచారణ చేయాలి. ప్రవాహము మొదలా? లేక, వర్షము మొదలా? అని విచారణ చేసినప్పుడు వర్షమే మొదలు అని తెలుస్తుంది. వర్షము కురిసినప్పుడే ప్రవాహము ఏర్పడుతుంది. కాబట్టి, వర్షమును కర్తవ్యముతోను, ప్రవాహమును హక్కుతోను పోల్చవచ్చును. చాలామంది 'రైట్' (హక్కు) కోసం 'ఫైట్' చేస్తుంటారు. తల్లి లేకుండిన బిడ్డ ఎక్కడినుండి వస్తుంది? అదేరీతిగా, కర్తవ్యమును నిర్వర్తించకుండిన హక్కు చిక్కదు. కనుక, మొట్టమొదట కర్తవ్యమును నిర్వర్తించాలి. అప్పుడే కర్తవ్య ఫలమైన హక్కు మీకు ప్రాప్తిస్తుంది. నిజం చెప్పాలంటే, మానవునికి ఎలాంటి హక్కూ లేదు. తన కర్తవ్యమును నిర్వర్తించినప్పుడు దాని ఫలమే హక్కుగా మారుతుంది.

**ప్రాకృత విద్య, పారమార్థిక విద్య రెండూ అవసరమే**

విద్యార్థులారా! మీరు చదువుతున్నారు, గొప్ప డిగ్రీలు పొందుతున్నారు. కాని, ఎన్ని డిగ్రీలు పొందినా మానసికశాంతిని అందుకోలేకపోతున్నారు. "ఇహమున సుఖియింప హేమతారక విద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య". ఇహలోక సుఖముకోసం భౌతిక విద్యలు నేర్వాలి; పరలోక సుఖముకోసం ఆధ్యాత్మికతత్త్వమును విచారణసల్పాలి. ఆధ్యాత్మిక జ్ఞానము భౌతికవిద్యలతో లభ్యమయ్యేది కాదు. "అధ్యాత్మ విద్యా విద్యానాం". "సా విద్యా యా విముక్తయే". కాని, ఈనాటి విద్యార్థులు ఆధ్యాత్మికమును గురించి అనేక సందేహాలకు చోటిస్తున్నారు. మానవత్వము దివ్యత్వముతో కూడినదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు. మొట్టమొదట "నేనెవరు?" అని విచారణ చేసినప్పుడే సత్యము బోధపడుతుంది.

ఈనాటి మానవుడు సైన్సు చాలా గొప్పదని భావిస్తున్నాడు. అయితే, సైన్సుకి ఏవిధంగా వచ్చిందీ గొప్పతనము? ఇది కేవలం భౌతికమైన విద్యవలన ఏర్పడింది. ఈ సైన్సు ప్రకృతియొక్క పరిస్థితిని విపులీకరించి చెబుతుంది. ఎట్లా పుట్టింది? ఎట్లా పెరిగింది? ఎట్లా జరుగుతోంది? మొదలైన విషయాలను సైన్సు మనకు బోధిస్తుంది. అయితే, దీనికి ఆధారమైన తత్త్వమొకటున్నది. అదియే ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికమనే ఆధారమే లేకుండిన సైన్సు ప్రభావం ఏమాత్రం గోచరించదు. ఈనాటి మానవుడు జగత్తులో ఉన్న సమస్తమునుగురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. Man has conquered all, but he has not conquered himself అన్నాడు చర్చిల్. మానవుడు అన్నింటినీ తెలుసుకుంటున్నాడుగాని, తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. ఏమి ప్రయోజనం? మొట్టమొదట 'నేనెవరు? నా తత్త్వమేమిటి?' అని విచారణ చేసినప్పుడే తాను సత్యమును గుర్తించగలడు. ప్రాచీనకాలంలో గురువులు ఈ స్నాతకోత్సవ సమయంలో తమ శిష్యులను చేరదీసి, "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ..." ఇలాంటి

ఆదర్శవంతమైన భావాలను ప్రబోధించేవారు. తల్లి తండ్రిని చూపుతుంది. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవాన్ని చూపుతాడు. కాని, ఈనాడు దైవాన్ని చూపే గురువులు చాలా తక్కువగా ఉన్నారు. విద్యార్థులు తమ మాతృమూర్తిని మరచిపోతున్నారు; మాతృదేశాన్ని విస్మరిస్తున్నారు. పూర్వం విద్యార్థులు యోగము నిమిత్తం విద్యనభ్యసించేవారు. కాని, ఈనాడు ఉద్యోగము నిమిత్తం విద్యనభ్యసిస్తున్నారు.

**విదేశవ్యామోహాన్ని విడనాడండి**

విద్యార్థినీ విద్యార్థులారా! విద్య అనగా ఏదో కసరత్తు కాదు. ఇది జీవితపరమావధి నిమిత్తమేగాని, కేవలం జీవనోపాధికోసం కాదు. ఈనాడు మీరు డిగ్రీలు తీసికొని బయటికి వెళుతున్నారు. మన దేశంలో సుమారు రెండు వందల యూనివర్సిటీలున్నాయి, ఎన్నో వేల కాలేజీలున్నాయి. ప్రతి సంవత్సరము ఈ యూనివర్సిటీలు వేలాదిమందికి డిగ్రీలిచ్చి పంపిస్తున్నాయి. కాని, అందరికీ ఉద్యోగాలు చిక్కడం లేదు. దానివల్ల ఏమి చేస్తున్నారు విద్యార్థులు? విదేశాలకు ప్రయాణమై వెళుతున్నారు. అక్కడికి వెళ్ళి పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడ చేసే పనులు స్వదేశంలోనే ఎందుకు చేయకూడదు? ఈనాటి విద్యావంతులు మాతృభూమిని విస్మరించి ఇతర దేశాలకు 'సర్వీసు' చేస్తున్నారు. ఇది విద్యావంతుల లక్షణమే కాదు. మీరు పుట్టి పెరిగిన దేశముకోసం మీ జీవితాన్ని ధార పోయాలి. జీవిత సంగ్రామములో ధీరులై నిలిచి విజయాన్ని సాధించాలి. ఈనాటి విద్యార్థులు పని చేయడానికి సిద్ధంగా లేరు. చదవడం, పెద్ద డిగ్రీలు తీసుకోవడం గొప్పతనం కాదు. Work is important. కష్టపడి పనిచేయాలి. భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చి 50 సం॥లు దాటింది. దాని తరువాత ఎన్నో లక్షలమంది విద్యార్థులు డిగ్రీలు తీసుకున్నారు. వారందరూ ఇప్పుడు దేశానికి చేస్తున్న ఉపకారమేమిటి? సమాజసేవలో ఏమాత్రం పాల్గొనడం లేదు. భారతదేశ ఔన్నత్యముకోసం ఎవ్వరూ పాటుపడడం లేదు. పరాయి ఇంటిని చక్కదిద్దడానికి ప్రయత్నించే ముందు ఎవరి ఇంటిని వారు చక్కదిద్దుకోవాలి.

**స్వదేశంలోనే ఉండి సమాజసేవ చేయండి**

విద్యార్థులారా! పరదేశ ప్రయాణమును మానుకోండి. మీకు ఏ ఉద్యోగమూ చిక్కకపోయినా ఫరవాలేదు; స్వదేశములోనే ఉండి సమాజసేవ చేయండి. మీ జన్మభూమియైన భారతదేశానికి సత్కీర్తిని సంపాదించండి. 'ఈ విద్యార్థి కర్మవీరుడు, సాధనలో ధీరుడు', అనే కీర్తిని సంపాదించుకోండి. స్వదేశమును కాపాడుకోండి. మీకందరికీ తెలుసు – మన భారత దేశాధ్యక్షుడైన అబ్దుల్ కలాం ఈరోజు ఇక్కడికి వచ్చాడు. ఆయన ఏనాడూ డబ్బుకోసం విదేశాలకు పోలేదు. తాను నేర్చుకోవలసిన సైన్సు అంతా మన భారత దేశమునందే నేర్చుకున్నాడు. భారత దేశములో లేనిది విదేశాల్లో ఏముంది చెప్పండి. "యన్న భారతే తన్న భారత". మన దేశములో లేనిది విదేశాల్లో ఎక్కడా కనిపించదు. సమస్త శక్తులూ భారత దేశమునందే ఉన్నాయి. మీరు భారతదేశమునందు పుట్టారు, భారత దేశమునందు పెరిగారు. కాని, మీరు పుట్టి పెరిగిన భరత భూమి యొక్క పుణ్యతత్త్వాన్ని గుర్తించుకోలేకపోతున్నారు. ఇది కర్తవ్యనిర్వహణను ప్రబోధించే కర్మభూమి, పుణ్యసంపదను చేకూర్చే పుణ్యభూమి. ఇలాంటి కీర్తిప్రతిష్ఠలతో విలసిల్లే భారతదేశమును విస్మరించి 'డ్రైల్యాండ్'కి పోయి ఏమి సాధించగలరు? మీరు నేర్చిన విద్యలను విదేశాలకోసం ధారపోసే బదులు వాటిని స్వదేశాభివృద్ధి కోసం వినియోగించండి. మీ ప్రజలకు మీరు సేవ చేయండి. మీ ఇంటిని మీరు కాపాడుకోండి. అప్పుడే మీ విద్య సార్థకమౌతుంది.

**దేహాభిమానం కాదు, దేశాభిమానం పెంచుకోవాలి**

మొట్టమొదట మీరు నడుము వంచి పని చేయాలి; కర్మవీరులుగా రూపొందాలి. పని చేయకుండా కేవలం

మాటలతో తమాషాగా జీవితాన్ని గడపడం సరియైన పద్ధతి కాదు. సత్కీర్తిని సాధించాలంటే కష్టపడి పనిచేయాలి. ఒక చిన్న విత్తనము పెద్ద వృక్షముగా రూపొందాలంటే ఏమి చేస్తుంది? తాను భూమిలోకి పోయి తన రూపాన్ని త్యజిస్తుంది. అప్పుడే అదొక మహావృక్షముగా ఆవిర్భవించి మనకు ఫలముల నందిస్తుంది. విత్తనము తన రూపాన్ని పూర్తి త్యజించినట్లుగా మీరు అహంకారమును నిర్మూలం గావించుకోవాలి. అప్పుడే మీకు సరియైన ఫలితం లభిస్తుంది. దేహాభిమానమును వదలిపెట్టాలి, దేశాభిమానమును పట్టుకోవాలి. ఈనాటి విద్యార్థులకు దేశాభిమానమే లేదు. జాతీయగీతము తెలుసా? అని అడిగితే తెలియదంటారు. కాని, సినిమాపాటలు మాత్రం కావలసినన్ని తెలుసు! మాతృభూమి కీర్తిప్రతిష్ఠలను గురించి వారేమాత్రం పట్టించుకోవడం లేదు.

విద్యార్థులారా! మీరు దేశగౌరవాన్ని కాపాడుతూ రావాలి. ఆత్మగౌరవాన్ని అభివృద్ధిగావించుకోవాలి. ఆత్మగౌరవమును కోల్పోయిన వాడు దేనినీ సాధించలేడు. ఈనాడు మీరు పోషించుకోవలసింది ఆత్మగౌరవము. అది ఒక్క ఆధ్యాత్మికమార్గమునందే సాధ్యముకాని, మరొక మార్గములో లభించదు. ఈనాటి విద్యార్థులంతా కలిమి, బలిమి, చెలిమి – ఈ మూడింటిని మాత్రమే కోరుతున్నారు. మరి గుణము మాటేమిటి? గుణము లేకపోతే వీటివలన ప్రయోజనము లేదు. విద్యార్థులు 'హలో, హలో...' అంటూ ఒకరితో ఒకరు స్నేహము చేస్తున్నారు. ఈ స్నేహములో సరియైన గుణమును పెట్టుకోవాలి. నోటితో hellowఅని చెబుతున్నారేగాని, వారి చేతలు మాత్రం hollow గా ఉంటున్నాయి. ఏమి ప్రయోజనం? ఎదుటి మనిషిని మనం గౌరవించాలి, సేవించాలి. అప్పుడే ఇతరులు మనలను గౌరవిస్తారు, సేవిస్తారు. ఇతరులనుండి మీరు ఏమి ఆశిస్తున్నారో మొట్టమొదట దానిని మీరు ఇతరులకు చేసి చూపించాలి. మీ ప్రక్కింటివారి గతి ఏవిధంగా ఉన్నదో మీరు పట్టించుకోవడంలేదుగాని, మీకు మాత్రం అందరూ సహాయం చేయాలని ఆశిస్తున్నారు. ఇది మంచిది కాదు. మీకు సిరిసంపదలకు లోటు లేకపోవచ్చును. కాని, సిరిసంపదలతో వచ్చేదికాదు గౌరవము. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతాగుణాలను మీరు సాధించాలి. మానవతావిలువలు లేకుండా మీరు మానవులమని చెప్పుకుంటే ఎవరు ఒప్పుకుంటారు?!

ప్రేమస్వరూపులారా! సత్యమే మీ ప్రత్యక్ష దైవము. సత్యమును మీరు కాపాడుకున్నప్పుడు అది మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉండి అన్నివిధాలుగా మిమ్మల్ని కాపాడుతుంది. కాబట్టి, ఎలాంటి పరిస్థితిలోనైనా సత్యాన్ని వదలకండి. ఒకరు 'బిగ్గరు' కావచ్చును, మరొకరు 'బెగ్గరు' కావచ్చును. కాని, ఇద్దరియందున్న ఆత్మ ఒక్కటే. ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తిస్తే అందరూ ఒక్కటైపోతారు. అందరియందున్న ఏకత్వాన్ని దర్శించినప్పుడే మీరు దైవత్వాన్ని పొందగలరు. చూడండి, ఇక్కడ ఎన్నో బల్బులున్నాయి. కాని, వాటిలో ప్రసరించే కరెంటు ఒక్కటే కదా! అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తించాలి. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఈ సత్యతత్త్వాన్ని గుర్తించి నప్పుడు మీకు సకల సౌభాగ్యములూ చేకూరుతాయి. సౌభాగ్యముల కోసం మీరు ప్రాకులాడనక్కర్లేదు. నిజమైన సౌభాగ్యము మీలోనే ఉన్నది. దానిని ఎవ్వరూ దొంగిలించుటకు వీలుకాదు. అదే దివ్యత్వము. అట్టి సౌభాగ్యాన్ని మీరు కాపాడుకోవాలి.

**అబ్రహాం లింకన్ వృత్తాంతము**

ప్రేమస్వరూపులారా! మీ మనస్సు మంచిదైతే మీ మాటలు, చేతలుకూడా మంచివౌతాయి. అప్పుడే మీరు సమాజంలో గౌరవాన్ని పొందగలరు. అబ్రహాం లింకన్‌గురించి మీకు చెప్పాను కదా! అతను చాలాబీదకుటుంబంలో జన్మించాడు. చదువుకోవడానికి తనదగ్గర పుస్తకాలు లేకపోతే స్నేహితులదగ్గరినుండి తీసికొని, రాత్రిపూట వీధిదీపాల వెలుతురులో చదువుకొని మరుసటి రోజున వాటిని తిరిగి ఇచ్చేసేవాడు. ధరించడానికి సరియైన దుస్తులుకూడా అతనికి ఉండేవి కావు. ఒకనాడు తోటివిద్యార్థులు, "ఇలాంటి బెగ్గర్ ఏవిధంగా చదువుకోగలడు?" అని అవహేళన చేశారు. లింకన్ ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చి జరిగిన సంగతి తల్లికి

చెప్పాడు. అప్పుడామె, "నాయనా! మీ నాన్నగారు కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. నేను పాతగుడ్డలు కుట్టి ఏదో కొంత డబ్బు సంపాదిస్తున్నాను. మన ఇంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకో. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో. ఆత్మగౌరవాన్ని పోషించుకో. నీకు తప్పక జయము కల్గుతుంది", అని బోధించింది. తల్లి మాటలు అతని లేతహృదయంపై చెఱగని ముద్రవేశాయి. అతను ఆత్మగౌరవాన్ని పోషించుకుంటూవచ్చాడు. క్రమక్రమేణ సమాజంలో మంచిపేరు పొందాడు. స్నేహితుల ప్రోత్సాహంతో అతను ఎలక్షన్లలో పోటీ చేసి విజయం సాధించాడు. కష్టపడి పనిచేసి అమెరికా ప్రెసిడెంటు అయినాడు. ఒక బీదవాడు అమెరికా అధ్యక్షుడు కాగల్గాడంటే కారణ మేమిటి? ఇంతటి గౌరవము అతనికి ఎక్కడినుండి వచ్చింది? ధనమువలన రాలేదు, కేవలం ఆత్మగౌరవమువల్లనే వచ్చింది. కనుక, విద్యార్థులారా! మీరు ఎక్కడికి వెళ్ళినప్పటికీ, ఎలాంటి పరిస్థితులు మీకు ఎదురైనప్పటికీ ఆత్మగౌరవాన్ని మాత్రం వదలకండి. మీలో ఏవైనా మృగలక్షణాలు తలెత్తితే, "నేను మృగాన్ని కాను, నేను మానవుడను", అని మిమ్మల్ని మీరు హెచ్చరించుకోండి.

**నమ్మినవారికి దైవసహాయం తప్పక ఉంటుంది**

క్రొవ్వొత్తి దీపాలు తాము కరిగిపోతూ మనకు వెలుగునిస్తాయి. మీరు కూడా అట్టి త్యాగమూర్తులుగా తయారుకావాలి. స్వార్థాన్ని త్యజించి సంఘశ్రేయస్సుకోసం పాటుపడాలి. ఈ అంశంపై ఈరోజు సాయంకాలం మా పిల్లలు అబ్రహాం లింకన్ స్టోరీ ఆధారంగా ఒక డ్రామాను ప్రదర్శిస్తారు. ఆ డ్రామాలో ఒక పేదవిద్యార్థి మెడిసిన్ చదవాలని ఆశిస్తాడు. కాని, అతనివద్ద పుస్తకాలు కొనడానికికూడా డబ్బు ఉండదు. అతను తోటివిద్యార్థుల దగ్గర పుస్తకాలు తీసికొని రాత్రిపూట వీధిదీపాల వెలుతురులో కష్టపడి చదివి మెడికల్ సీటు సంపాదిస్తాడు. మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ చాలా మంచివాడు. "నాయనా! నీవు చాలా తెలివితేటలు గల విద్యార్థివి. భవిష్యత్తులో గొప్ప డాక్టర్‌వౌతావు. నేను నీకు సీటిస్తాను. కాని, ఒక నెలలోగా ఫీజు చెల్లించవలసి ఉంటుంది", అని చెబుతాడు. ఆ విద్యార్థి నిరాశతో ఇంటికి తిరిగి వస్తాడు. తండ్రి అతనిని ఓదార్చుతూ, "నాయనా! నీవేమీ బాధపడవద్దు. భగవంతుడనేవాడు ఒకడున్నాడు. ఆయన సర్వాంతర్యామి. అందరినీ అన్నివేళల రక్షణ చేసేవాడు ఆయనే", అని బోధిస్తాడు.

ఆ విద్యార్థి తండ్రి మాటలను పూర్తిగా విశ్వసిస్తాడు. మరుసటి రోజున కాలేజీ గార్డెన్‌లో కూర్చుని, తనకు సహాయం చేయవలసిందిగా ప్రార్థిస్తూ దైవానికి ఒక లెటర్ వ్రాస్తాడు. "ఓ దైవమా! నీవు ఎక్కడ చూసినా ఉన్నావని మా తండ్రిగారు చెప్పారు. నీవు అన్నిచోట్ల ఉంటే నాకెందుకు దర్శనం ఇవ్వకూడదు? నాకు డాక్టర్ కావాలని ఉంది. కాని, ఫీజు కట్టడానికి నావద్ద డబ్బు లేదు. కనికరించి నాకు డాక్టర్ డిగ్రీని ఇప్పించు..." ఈరీతిగా అతను ఉత్తరం వ్రాయడం పూర్తి చేయగానే బెల్ వినిపిస్తుంది. క్లాసుకి టైమ్ అయిందని కంగారుగా లేచి వెళ్ళిపోతాడు. ఆ కంగారులో భగవంతునికి వ్రాసిన జాబు పుస్తకంలోనుండి జారి క్రిందపడిపోతుంది. కొద్దిసేపటికి పుణ్యాత్ముడైన ఒక శ్రీమంతుడు అక్కడికి వస్తాడు. ఆయన ఆ ఉత్తరాన్ని తీసి చదువుతాడు. క్రింద ఆ విద్యార్థి పేరుంటుంది. వెంటనే ఆయన కాలేజీ ప్రిన్సిపాల్‌ని కలుసుకుని, ఆ విద్యార్థి కట్టవలసిన ఫీజునంతటినీ ఒకేసారి చెల్లిస్తాడు. అయితే, అతని చదువు పూర్తయ్యేంతవరకు ఫీజు ఎవరు చెల్లించారనే విషయాన్ని రహస్యంగా ఉంచాలని కోరుతాడు. మరునాడు ప్రిన్సిపాల్ ఆ విద్యార్థిని పిలిచి, "నాయనా! నీవేమీ చింత చేయవద్దు. నీవు కట్టవలసిన ఫీజు నిన్ననే నాకు అందింది", అని చెబుతాడు. ఆ విద్యార్థికి చాలా ఆశ్చర్యం కల్గుతుంది. ఎవరు చెల్లించారని అడిగితే ప్రిన్సిపాల్, "ఇప్పుడు కాదు, నీవు డిగ్రీ పూర్తి చేసిన తరువాత చెబుతాను", అంటాడు. ఆ విద్యార్థి కష్టపడి చదివి డాక్టరు డిగ్రీ పూర్తి చేస్తాడు. స్నేహితులు అతనిని అభినందిస్తూ, "ఇక నీవు గొప్ప డాక్టరువై దండిగా డబ్బు సంపాదించవచ్చు", అంటారు. అప్పుడతను, "నేనీ చదువు చదివింది సేవచేయడానికే గాని,

డబ్బుకోసం కాదు. నేను ఉచితంగా చదువుకున్నాను. అదేవిధంగా, అందరికీ ఉచితంగా సేవచేస్తాను. సమాజ సేవకు నా జీవితాన్ని అంకితం చేస్తాను", అంటాడు. అలాంటి త్యాగమూర్తులైన విద్యావంతు లీనాడు లోకంలో చాలా అరుదుగా ఉన్నారు.

నిజమైన నమ్మకంతో భగవంతుణ్ణి తలచేవారు, పూజించేవారు, ఆత్మవిశ్వాసము కలిగినవారు ఎప్పుడైనా ఎలాంటి ఘనకార్యమునైనా సాధించగలరు. కాని, ఈనాడు "నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి జనులు అవనియందు". చర్మచక్షువులను తెరచినంత మాత్రాన ప్రయోజనం లేదు. జ్ఞానచక్షువును తెరవాలి. అప్పుడే మీకు తగిన ఫలితము దక్కుతుంది.

**డబ్బుతో నాకవసరం లేదు, ప్రేమయే నాకవసరం**

ఈ రోజుల్లో డబ్బు లేకుండా ఎక్కడా స్కూల్లో ప్రవేశము చిక్కదు. పుట్టిన బిడ్డకు ఎలిమెంటరీ స్కూల్లో ముందుగానే సీటు బుక్ చేసుకుంటారు. తెలివితేటలున్నప్పటికీ ఫీజు కట్టే శక్తి లేకపోతే ఎవ్వరూ చేర్చుకోరు. కాని, మా విద్యాసంస్థలు అలాంటివి కావు. ఎవరైనా సరే, అర్హత ఉంటే సీటు ఇవ్వాలి. డబ్బుతో నాకవసరం లేదు; ప్రేమయే నాకవసరం. ప్రేమతో సంపాదించగల్గింది ఇంక దేనితోనూ సంపాదించడానికి వీలుకాదు. విద్యార్థులారా! మీరు ఇంతకాలము స్వామి కాలేజీలో చదువుకున్నారు. చదువు నిమిత్తం మీకు ఎప్పుడైనా ఒక్క నయాపైసైనా ఖర్చైందా? లేదు. మీకు ఎక్కడైనా ఖర్చు అవుతుందేమోనని నేను బాధపడుతుంటాను. ఒక చిన్న విషయము మీకు చెబుతున్నాను. ఇలాంటివి నేనెప్పుడూ చెప్పలేదు. పరీక్షలు వస్తే హాస్టల్లోపిల్లలు రాత్రంతా లైట్లు వేసుకొని చదువుతుంటారు. దాంతో కరెంటుబిల్లు పెరిగిపోయింది. ఒకరోజున ఎలక్ట్రిసిటీ డిపార్టు మెంటువారు పవర్ సప్లై కట్ చేశారు. వారి డ్యూటీ వారు చేశారు. వార్డెన్ వచ్చి ఈవిషయాన్ని నాతో చెప్పుకున్నాడు. "లైట్లు లేక పిల్లలు చాలా బాధ పడుతున్నారు స్వామీ", అని చెప్పాడు. "పిచ్చివాడా! నేనేమైనా పరాయి వాడినా? నాకీ విషయాన్ని ముందే ఎందుకు చెప్పకూడదు?" అని మందలించాను. "స్వామీ! మీరు పిల్లల చదువుకోసం ఎంతో ఖర్చు పెడుతున్నారు; ఎంతో బాధ్యత తీసుకుంటున్నారు. ఈ బాధ్యత కూడా మీపై ఎలా పెట్టేదని నేను చెప్పలేదు", అన్నాడు. "బిల్లు ఎంతయింది?" అని అడిగాను. డెబ్బై వేలు కట్టాలన్నాడు. వెంటనే అతనికి డబ్బు ఇచ్చి, "నీవేమీ యోచన చేయవద్దు, పిల్లలకు చెప్పవద్దు. వెంటనే ఈ బిల్లు కట్టేసి పిల్లలకు లైటు ఇప్పించు", అని చెప్పాను. ఈవిధంగా పిల్లలకోసం నేను ఎన్నో పనులు చేస్తుంటాను.

**"కల్పవృక్షములా మీరుంటే మాకేమి కొదవ?"**

ఒకపర్యాయం ఒక విషాదకరమైన వార్త నా దృష్టికి వచ్చింది. ఒక నిరుపేదరాలైన తల్లి తన ముగ్గురు బిడ్డలను పోషించలేక, వారికింత విషం పెట్టి తానూ తిని ప్రాణం విడిచింది. ఆమె భర్త మరణించిన తరువాత వాళ్ళను పోషించేవారెవ్వరూ లేకపోయారు. ఈ వార్త నాకు చాలా బాధ కల్గించింది. 'అన్నపూర్ణ' అని పేరు గాంచిన భారతదేశంలో ప్రజలు తిండిలేకుండా చావడమా? తల్లిదండ్రులు లేని పిల్లల గతి ఏమిటి? అలాంటివారికి మనం ఒక ఆధారం చూపించాలి, ఆదర్శం అందించాలి. కనుకనే, మేము దీనజనోద్ధరణ పథకం ప్రారంభించాము. బుక్కపట్నం, పుట్టపర్తి, క్రొత్తచెఱువు మండలముల నుండి నిరుపేద కుటుంబాలకు చెందిన 60మంది పిల్లలను ఇక్కడికి తెచ్చాము. ఊరకే రమ్మంటే ఎవ్వరూ రారు. "నాయనలారా! మీకు భోజనం పెడతాము, చదువు చెప్పిస్తాము, ఒక ఆధారం చూపిస్తాము. మీరేమాత్రము భయపడవద్దు", అని ధైర్యం చెప్పాము. ఒక నెలలోపలనే వారికి ఇళ్ళు కట్టించాము. ఒక్కొక్క పిల్లవాని పేరుతో ఒక లక్ష రూపాయల చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే నిమిత్తం ఈనాడు పరమహంసకు అరవై లక్షల రూపాయల చెక్కు ఇచ్చాను. ఆ పిల్లలు తమ చదువు పూర్తి

చేసుకొని ఉన్నతస్థితికి వచ్చేటప్పటికి ఈ డబ్బు వడ్డీతో కలిపి మూడు, నాల్గు లక్షల రూపాయలవుతుంది. ఆ డబ్బుతో వారు సుఖంగా జీవితం గడపవచ్చు. పరమహంస వారిని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. స్వామిదర్శనార్థం వారిని బస్సులో తీసికొనివచ్చి, తిరిగి బస్సులో తీసుకువెళుతున్నారు. ఆ పిల్లలు ఎంతో ఆనందంగా ఉన్నారు. వేదంకూడా నేర్చుకుంటున్నారు. "నాయనలారా! బాగున్నారా?" అంటే, "కల్పవృక్షములాగ మీరుంటే మాకేమి కొదవ స్వామీ!" అంటారు. వారికింతటి ఆనందము ఎక్కడినుండి చిక్కింది? డబ్బు ఇస్తే చిక్కుతుందా? చిక్కదు. ప్రేమచేత వారికి ఆశ్రయం ఇవ్వడంవల్లనే వారెంతో ఆనందంగా ఉన్నారు. ఈవిధంగా నేను చేసే పనులు అనేకం ఉన్నాయి. కొందరు నమ్మకపోవచ్చు. వారి నమ్మకంతో నాకేమి పని?! నా నమ్మకం నాది. పిల్లలను పోషించాలి, వారిని ఉద్ధరించాలి. వారూ మానవులే కదా! వారు మనకంటే వేరు కాదు. కాబట్టి, వారి అభ్యున్నతికి పాటుపడాలి.

**"పిల్లలే నా ప్రాపర్టీ"**

విద్యార్థులారా! మీరింతకాలము హాస్టల్లో ఉండి చదువుకున్నారు. ఇంక, మీమీ స్వస్థలాలకు తిరిగి వెళ్ళి తల్లిదండ్రులను సేవించండి. ఉద్యోగాలు చేసుకుంటూ మధ్యమధ్య వచ్చివెళుతూ ఉండండి. లేకపోతే, మీరిక్కడ నేర్చుకున్నవన్నీ మరచిపోయే ప్రమాదముంది. ఇక్కడ నేర్చుకున్న విషయాలను చక్కగా గుర్తుంచుకొని ఆచరణలో పెట్టండి.

(స్వామి ఆదేశం మేరకు బృందావనం క్యాంపస్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న శ్రీ రఘుపతిరావు లేచి నిలబడ్డారు. అతడ్ని చూపిస్తూ స్వామి ఇలా అన్నారు)

ఆ అబ్బాయిని అడగండి. అతనికి తల్లి లేదు, తండ్రి లేదు. అయితే, మొదట్లో ఇక్కడికి వచ్చినప్పుడు తల్లి ఉండేది. 'అనంతపురం హాస్టల్లో ఉండి పిల్లలను చూసుకోమ్మా!' అని చెప్పాను. తరువాత ఆమెకూడా మరణించింది. అప్పుడీ పిల్లవానిని తీసికొని వచ్చి చదివించాను. తాను శ్రద్ధగా చదివి MBA పూర్తి చేసి ఇప్పుడు లెక్చరరుగా పనిచేస్తున్నాడు. మేమే ఉద్యోగం ఇచ్చాము. ఈవిధంగా ఎందరినో పోషిస్తున్నాను. ఇది నా డ్యూటీ. నేను పరాయివాడిని కాను. నేను మీవాడిని, మీరు నావారు. ఇలాంటి ప్రేమచేత పెంచి పోషించడంచేతనే పిల్లలెంతో ఆదర్శ ప్రాయులుగా రూపొందుతున్నారు. ఇతను చాలా మంచి పిల్లవాడు. ఎవ్వరినీ ఏదీ అడిగేవాడు కాడు. "నీకేదైనా అవసరమైతే ఎవ్వరినీ అడగవద్దు. నన్ను అడుగు, నేనిస్తాను", అని ముందే చెప్పాను. ఇవన్నీ ఈనాడు మీకెందుకు చెబుతున్నానంటే, ఇలాంటి పిల్లలు చిక్కితే మీరుకూడా వారిని పోషించండి. సమాజసేవయే సర్వేశ్వర సేవ. The best way to love God is to love all and serve all. కనుక, అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి. చదువులో ఉన్న సారమిదియే. "*విద్యవలన వినయము, వినయము వలన కలుగు పాత్రత, పాత్రతవలన ధనము, ధనమువలన ధర్మము, దానివలన ఐహికాముష్మిక సుఖములనొందు నరుడు*" కాబట్టి, వినయముచేత జీవితాన్ని గడపండి. అహంకారాన్ని నిర్మూలించుకొని ఆత్మవిశ్వాసముచేత సమాజసేవ చేయండి. మంచిపిల్లలకు ఏమాత్రం లోటురాదు. వారి భవిష్యత్తు అంతా నేనే చూసుకుంటాను. చదువు పూర్తి అయిన తరువాత ఆ పిల్లవానిని, "నాయనా! బయటికి పోవాలని నీకిష్టముందా?" అని అడిగాను. బయటికి వెళ్ళడం తనకిష్టం లేదన్నాడు. "అయితే ఇక్కడే ఉండు", అని చెప్పి మంచి జీతముతో అతనికి ఉద్యోగ మిచ్చాను. జీతాలు లేకుండా నేను పని చేయించుకోను. ఎవరివద్దనుండీ నేను నయాపైసా అడగటం లేదు. నేను చేసే మంచిపనులకు అవసరమైన డబ్బు దానంతటదే వస్తుంది. ఇన్ని లక్షలమంది ఇక్కడికి వస్తున్నారు. 30, 40 సంవత్సరాలనుండి ఇక్కడికి వచ్చేవారుకూడా అనేకమంది ఉన్నారు. కాని, నేను ఎవరినైనా ఏనాడైనా ఒక్క పైసైనా అడిగానా? ఎప్పుడూ అడగలేదు. అడగను. నా దీక్షను నేను విడిచిపెట్టను. ఇది క్రమక్రమేణా ఇంకా అభివృద్ధి అవుతుందేగాని, క్షీణించదు. ఇలాంటి ఆదర్శప్రాయులైన పిల్లలు చిక్కితే, అంతకంటే ఆనందమేముంటుంది? నా

ప్రాపర్టీ అంతా పిల్లలే. వారు బాగుపడి, సత్కీర్తిని సాధించడమే నాకు కావలసింది. అదే నాకు ఆనందము.

విద్యార్థులారా! ఇది మీరు డిగ్రీ పుచ్చుకునే రోజు. యూనివర్సిటీ వారు మీకు ఎడ్యుకేషన్‌లో డిగ్రీ ఇస్తున్నారు, నేను 'ఎడ్యుకేర్'లో మీకు డిగ్రీ ఇస్తున్నాను. 'ఎడ్యుకేర్' అనేది ఆత్మానందమునకు సంబంధించినది. మీకు ఏది కావలసివచ్చినా నేను చూసుకుంటాను. మీరు సోమరిపోతులు కాకూడదు, మీ పని మీరు చేయాలి. Laziness is rust and dust. Realisation is best and rest. అట్టి 'రియలైజేషన్' పొందడానికి మీరు సిద్ధం కండి.

**ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం**

ఈనాడు అబ్దుల్ కలాం వచ్చి మన కాన్వొకేషన్‌లో పాల్గొనడం నాకెంతో ఆనందం కల్గిస్తోంది. అతనిలో దేశాభిమానం అమితంగా ఉన్నది. ఏమాత్రం భేదం చూపకుండా అందరినీ ప్రేమిస్తాడు, అందరినీ చేరదీస్తాడు. అతను ధనసంపాదనకోసం ఇతర దేశాలకు పోలేదు; ఇతర దేశాల్లో విద్య నభ్యసించలేదు; భారతదేశములోనే ఉంటూ ఎంతో ఘనత సాధించాడు. ఇంతటి గొప్ప సైంటిస్టు ఎక్కడా కనిపించడం లేదు. ఈ రోజుల్లో సైంటిస్టులు ఎంతోమంది ఉన్నారు. కాని, ఏమి ప్రయోజనం? 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్! హౌ ఐ వండర్ వాట్ యు ఆర్' అన్నట్లు, అందరూ విదేశాలపట్ల ఆకర్షితులై భారతదేశాన్ని విడిచిపెడుతున్నారు. కాని, అబ్దుల్ కలాం అలాంటివాడు కాదు. అతనిలో ఏమాత్రం అహంకారము లేదు. అతని హృదయమే అతనికొక పెద్ద అలంకారము. అతనిది మంచి గుణము. అందువల్లనే, భారతదేశానికి ప్రెసిడెంటు కాగల్గాడు. అతను తన పదవీకాలంలో దేశాన్ని ఉద్ధరించాలని నేను ఆశిస్తున్నాను.

**(2002 నవంబరు 22వ తేదీ మధ్యాహ్నం సాయికుల్వంత్ సభా మండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)**